సాక్షి
గుంటూరు
సోమవారం । 11 । మార్చి । 2024





వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్, మంత్రి విడదల రజిని, లక్ష్మీపార్వతి, బాలినేని, మోపిదేవి, బీద మస్తాన్‌రావు తదితరులు





బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ఆదివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు పోటెత్తిన జనసందోహంలో ఓ భాగం (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

# జయ జయ జయహో..

## సిద్ధం సభ జన సంద్రం

సైన్యంలా...ఓ శాసనంలా
ఊళ్లన్నీ ఒక్కటిగా.. జనమంతా ఐక్యంగా
జన చేతన పొంగిన సంద్రంలా
కొత్త ఒరవడికి శ్రీకారంలా...
భూదేవి నుదుట దిద్దిన సిందూరంలా
మహోజ్వల ఘట్టానికి మలి మెట్టులా
సువర్ణ అధ్యాయానికి జన సంతకంలా
చరిత్ర పుటల్లో తమకంటూ ఓ పేజీలా
సమరోత్సాహంతో...సమధికోత్సాహంతో...
కదనరంగానికి దుమికినట్టు..
కార్యోన్ముఖులై కదిలినట్టు
జన సారథి వెంట జనవారధి కట్టినట్టు
రాజన్న బిడ్డ పాలన మళ్లీ రావాలంటూ
అభివృద్ధే లక్ష్యంగా.. సంక్షేమమే సాక్ష్యంగా
గడప గడప నుంచి.. పల్లె పల్లె నుంచి
జన సమూహాలు జన సందోహాలు
సిద్ధం సభకు తరలి వచ్చిన తీరు
మరో మహోద్యమాన్ని తలపించింది..
రేపటి భవితను సాక్షాత్కరించింది.



మా నమ్మకం నువ్వే అన్నా: సిద్ధం పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న యువత



కెవ్వు కేక : సమరానికి సిద్ధమంటూ విజిలేస్తున్న మహిళ



ఓ అన్నా.. నీవెంటే మేమంటూ నినదిస్తున్న యువతి

- అన్నిదారులూ బాపట్ల జిల్లా మేదరమెట్ల వైపే..
- ఉదయం నుంచే సభాస్థలికి తరలివచ్చిన జనసందోహం
- లక్షలాదిగా కదిలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు
- జనసంద్రంగా మారిన సభా ప్రాంగణం
- వందలాది ఎకరాలతోపాటు స్తంభించిన జాతీయ రహదారి
- సీఎం వైఎస్ జగన్ ప్రసంగంతో ఆద్యంతం హోరెత్తిన జనస్పందన
- నిన్ను మళ్లీ గెలిపించుకునేందుకు సిద్ధం అంటూ నినదించిన జనం



సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ఆదివారం జరిగిన సిద్ధం సభ జనంతో పోటెత్తింది. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో నిర్వహించిన ఈ సభకు ఆయా జిల్లాలనుంచి జనం లక్షలాదిగా తరలివచ్చారు. మధ్యాహ్నం తరువాత సభ జరగాల్సి ఉన్నా ఉదయం 9 గంటలనుంచే జనం సభా ప్రారంభానికి చేరుకోవడం ప్రారంభమైంది. 11 గంటల ప్రాంతానికి మేదరమెట్ల సమీపంలోని జాతీయ రహదారివద్ద వందలాది ఎకరాల్లో సిద్ధం చేసిన సిద్ధం సభా ప్రాంగణం జనంతో నిండి పోయింది. సమీపంలోని పొలాలతోపాటు పక్కనే ఉన్న చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి సైతం సభకు వచ్చిన జనంతో కనుచూపుమేర జనసంద్రంగా మారింది. ఈ రహదారిలో మేదరమెట్ల నుంచి రేణంగివరం వరకు 18 కిలోమీటర్ల వరకు రోడ్డు జనంతో కిక్కిరిసి పోయింది. మరోవైపు మేదరమెట్ల నుంచి అద్దంకి వరకు (హైదరాబాద్) ప్రధాన రహదారి జనసంద్రంగా మారింది. పిల్లలు, యువత, మధ్యవయస్కులు, వృద్ధులు, మహిళలు అన్నతేడా లేకుండా అన్నివర్గాలవారు వైఎస్సార్ సీపీ జెండాలు చేబూని సభకు తరలివచ్చారు. రాష్ట్రం నలుమూలలకు వినిపించేలా జై జగన్ అన్న సభికుల నినాదాలు సభలో హోరెత్తించాయి.



ప్రజల మధ్యకు వచ్చి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

### రెండు సార్లు బటన్ నొక్కేందుకు సిద్ధం..

58 నెలల్లో మీ బిడ్డ మీ కోసం 130 సార్లు బటన్‌నొక్కి రూ. 2.70 లక్షల కోట్లు మీ ఖాతాల్లో వేశానని, నా కోసం మీరు రెండు బటన్లు నొక్కలేరా అనగానే నొక్కుతాం...నొక్కుతాం అంటూ పెద్ద ఎత్తున ప్రతిధ్వనించారు. మీ బిడ్డకు ఓటేస్తే అన్ని పథకాలు అందుతాయని, బాబుకు ఓటేస్తే చంద్రముఖిని మనమే వెళ్లి నిద్రలేపి ఇంటికి తెచ్చుకున్నట్లేనని జగన్ అనడంతో అవును... అవును...అంటూ ప్రజలు స్పందించారు. 2019 మించి 175 కు 175 ఎమ్మెల్యేలు, 25 కు 25 ఎంపీలు గెలవడానికి మనమంతా సిద్ధమేనా అనగానే సిద్ధం..సిద్ధం అంటూ జనం హోరెత్తించారు. త్వరలోనే మేనిఫెస్టో ప్రకటిస్తానని, జగన్ మాట ఇచ్చాడంటే తగ్గేదేలే అంటూ అనగానే జనం ఈలలు, కేకలతో సభ దద్దరిల్లింది. మళ్లీ నిన్నే గెలిపించుకుంటామంటూ ప్రతిస్పందించారు. ప్రతిపక్షాలపై విమర్శలు బాణాలు సంధించినప్పుడు జనంలో ఉత్సాహంతో కూడిన ప్రతిస్పందన కనిపించింది. ఈ ఎన్నికల్లో వారి అంతు తేలుస్తామంటూ జనం ఆగ్రహంతో ఊగిపోయారు. కుట్రలు, కుతంత్రాలకు ముగింపు పలుకుతామంటూ నినదించారు. సభ ఆద్యంతం సీఎం...సీఎం అంటూ హోరెత్తించారు.ఈ సభలో మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, మేరుగ నాగార్జున, ఎంపీలు విజయసాయి రెడ్డి, మోపిదేవి వెంకటరమణారావు, కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు బాలినేని శ్రీనివాసరెడ్డి, కరణం బలరాం కృష్ణమూర్తి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కోన రఘుపతి, సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, నియోజకవర్గ సమన్వయకర్తలు పానెం చిన హనిమిరెడ్డి, కరణం వెంకటేష్, యడం బాలాజీ, ఈవూరి గణేష్, వరికూటి అశోక్, వైవీ భద్రా రెడ్డి పాల్గొన్నారు.





ర్యాంపు వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



నేను సైతం..

### అపూర్వ స్పందన..

సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభకు చేరుకున్నారు. తర్వాత సభావేదిక మీదకు చేరుకున్న ముఖ్యమంత్రి 4.47 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించి, 5.56 గంటలకు ప్రసంగాన్ని ముగించారు. ముఖ్యమంత్రి ప్రసంగం ఆద్యంతం సభికులను ఆకట్టుకుంది. ఆయన ప్రతిమాటా తూటాలా పేలింది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకోసం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ముఖ్యమంత్రి సూటిగా జనం ముందుంచారు. పథకాలతో జనానికి జరిగిన మేలును గణంకాల రూపంలో వివరించారు. ముఖ్యంగా పేదవర్గాల జీవన ప్రమాణాలు ఎలా మెరుగు పడ్డాయో తెలియ జెప్పారు. ప్రతిపక్షనేత చంద్రబాబు, జనసేన నేత పవన్‌కల్యాణ్, రాష్ట్రాన్ని విడగొట్టిన కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న కుట్రలను ప్రజల ముందు బట్టబయలు చేశారు. ప్రతిపక్షాలపై జగన్ విరుచుకు పడటంతో జగన్ గొంతులో గొంతు కలిపి తమదైన శైలిలో మద్దతు పలికారు. మరో ఐదేళ్ల ఈ ప్రభుత్వం కొనసాగాలంటే మీరు మద్దతు పలికేందుకు సిద్ధమా.? అనడంతో సిద్ధం..సిద్ధం అంటూ జనం ఈలలు, కేకలతో స్పందించారు. 'జగన్ సీఎం...సీఎం' అంటూ నినాదాలు చేశారు. పేదవాడి భవిష్యత్తు కాపాడేందుకు నాతో కలిసి రావడానికి మీరు సిద్ధమా...? అని సీఎం అనగానే సిద్ధం అంటూ జనం ప్రతిస్పందించారు. పార్టీలతో బాబు....ప్రజలతో మనం ఈ సంగ్రామానికి జనం సిద్ధమా... అనగానే సిద్ధం ...సిద్ధం అంటూ హోరెత్తించారు. ఇప్పటికే ఉత్తరాంధ్ర సిద్ధం..., ఉత్తర కోస్తా సిద్ధం, రాయలసీమ సిద్ధం... తాజాగా దక్షిణ కోస్తా సిద్ధం అంటూ జగన్ అనగానే సిద్ధం...సిద్ధం అంటూ ప్రజలు ప్రతిధ్వనించారు.

### ఆయుధాలు ప్రయోగించాల్సిన సమయం ఆసన్నం..

ఈ యుద్ధంలో మీది శ్రీకృష్ణుడి పాత్ర, నాది అర్జునుడి పాత్ర, దుష్టులపై ఆయుధాలు ప్రయోగించాల్సిన సమయం ఆసన్నమైంది. అందుకే జమ్మిచెట్టుపై నుంచి ఆయుధాలు దింపాల్సిన సమయం ఆసన్నమైందంటూ జగన్ భారతాన్ని ఉటంకించడంతో జనం కేరింతలు కొట్టారు. చంద్రబాబు లాగా మనకు 10 మంది నటించే పొలిటికల్ యాక్టర్లు లేరు....రకరకాల పార్టీలతో పొత్తులు లేవు. అందుకే ఒంటరిగానే ఎన్నికలకు వెళ్తున్నాను. మీ బిడ్డకు మీరే స్టార్ క్యాంపెయినర్లు. ప్రతిపక్ష పార్టీలో సైన్యాధిపతులు తప్ప సైన్యం లేదని 5 కోట్ల మంది సైన్యం అండదండలతో మనం సిద్ధం అని ముఖ్యమంత్రి అనగానే జనం ఈలలు, కేకలతో స్పందించారు. చంద్రబాబుకు దోచుకునేందుకు, దాచుకునేందుకే అధికారం కావాలని జగన్ అనడంతో జనం అవును...అవును అంటూ నినదించారు.





సిద్ధం సభకు తరలివచ్చిన పల్లె ప్రజానీకం



సిద్ధం సభ వద్ద యువత కేరింత

## క్లుప్తంగా

### మహిళ దారుణ హత్య


ఆశ మృతదేహం

గుంటూరు ఈస్ట్: మహిళ దారుణ హత్యకు గురైన ఘటన నగరంలో కలకలం రేపింది. నడిరోడ్డుపై కత్తి గాట్లతో విగత జీవురాలై పడి ఉండటాన్ని చూసి స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. పాత గుంటూరు ఎస్‌హెచ్‌ఓ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర కాలనీలో నివసించే ఆశ ఆరు నెలల కిందట రాజమండ్రి నుంచి గుంటూరు వచ్చింది. మొదట శివ అనే వ్యక్తి వివాహం చేసుకుని విడిపోయింది. అనంతరం దుర్గారావుతో సహజీవనం చేసి విడిపోయింది. ఆశకు నలుగురు పిల్లలు ఉన్నారు. గతంలో మూడో వ్యక్తితో సహజీనం చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం ఆశ ఓ వ్యక్తితో ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మూడు వంతెనల వద్ద దుర్గారావు వారిని అడ్డుకున్నాడు. తనతో తిరిగి సహజీవనం చేయాలని కోరాడు. ఆశ అందుకు నిరాకరించింది. దీంతో దుర్గారావు బెదిరించాడు. అయితే, అనూహ్యంగా ఎంప్లాయిస్ కాలనీ మెయిన్ రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున నడిరోడ్డుపై శవమై కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సృజనాత్మకతతో విద్యను అభ్యసించాలి



నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులు ర్యాంకుల వెర్రి తగ్గించుకొని సృజనాత్మకతతో విద్యను అభ్యసించాలని ఐఆర్‌ఎస్ అధికారి ఈదర రవికిరణ్ పేర్కొన్నారు. పట్టణానికి చెందిన ఆయన ప్రస్తుతం విశాఖలోని కస్టమ్స్, జీఎస్టీ అండ్ నార్కోటిక్స్ జాతీయ అకాడమీ అదనపు డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లా శాఖాగ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం సివిల్స్ తదితర పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు, తల్లిదండ్రులతో ముఖాముఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కులు, ర్యాంకులకు కాలం చెల్లిందని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో సృజనాత్మకత, భావ ప్రకటన సామర్థ్యం వంటి జీవన నైపుణ్యాలే భవిష్యత్తును నిర్ణయిస్తున్నాయని వివరించారు. ఇంగ్లిష్‌లో పట్టు సాధించాలంటే ముందుగా మాతృ భాషపై పట్టు ఉండాలన్నారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు ఆయన సమాధానమిచ్చి వారిలో నూతన ఉత్తేజాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి పాల్గొన్నారు.

# యుద్ధానికి 'సిద్ధం'

జిల్లావ్యాప్తంగా ఆదివారం 'సిద్ధం' సభ ఉత్సాహం నెలకొంది. దుష్ట చతుష్టయంపై ఎన్నికల సమరశంఖం పూరించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి బాసటగా వైఎస్సార్ సీపీ శ్రేణులు బాపట్ల జిల్లా మేదరమెట్లకు కార్లు, బస్సుల్లో భారీగా తరలివెళ్లారు. దారి పొడవునా యుద్ధానికి 'సిద్ధం' అంటూ నినదించారు. గుంటూరులో ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, పొన్నూరులో సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, ప్రత్తిపాడులో సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్, తెనాలిలో ఎమ్మెల్యే శివకుమార్, మంగళగిరిలో సమన్వయకర్త మురుగుడు లావణ్య జెండాలు ఊపి కార్లు, బస్సుల ర్యాలీలను ప్రారంభించారు. –నెట్‌వర్క్


గుంటూరులో జెండా ఊపి కార్ల ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి


సిద్ధం సభకు ప్రజలతో కలసి బస్సులో ప్రయాణిస్తున్న పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ


ప్రత్తిపాడు నుంచి సిద్ధం సభకు తరలి వెళుతున్న కార్యకర్తలు, నేతలతో సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్


మంగళగిరిలో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద బస్సులను ప్రారంభిస్తున్న సమన్వయకర్త మురుగుడు లావణ్య


బస్సును నడుపుతున్న తెనాలి ఎమ్మెల్యే శివకుమార్

## నేటి నుంచి ప్రభుత్వ సీబీఎస్‌ఈ పాఠశాలల్లో వార్షిక పరీక్షలు

- జిల్లాలోని 12 పాఠశాలల్లో 8,9 తరగతుల విద్యార్థులకు నిర్వహణ
- ఈనెల 16 వరకు జరగనున్న పరీక్షలు
- జిల్లాలో పరీక్షలు రాయనున్న 2,394 మంది విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ సీబీఎస్‌ఈ పాఠశాలల్లో 8, 9 తరగతుల విద్యార్థులకు సోమవారం నుంచి వార్షిక (టెర్మ్–2) పరీక్షలు జరగనున్నాయి. సీబీఎస్‌ఈ సిలబస్ ప్రవేశపెట్టిన తరువాత ప్రభుత్వ పాఠశాలల్లో వార్షిక పరీక్షలు రాస్తున్న తొలి బ్యాచ్ ఇదే కావడం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్ అమలు చేస్తుండగా, గుంటూరు జిల్లా వ్యాప్తంగా 12 పాఠశాలలు ఉన్నాయి. సోమవారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు జరగనున్న సీబీఎస్‌ఈ వార్షిక పరీక్షలకు 2,394 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో 8వ తరగతి 1,153, 9వ తరగతి విద్యార్థులు 1,241 మంది ఉన్నారు. సీబీఎస్‌ఈ వార్షిక పరీక్షల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిన ఏపీ మోడల్ స్కూల్స్, సీబీఎస్‌ఈ పాఠశాలల జాయింట్ డైరెక్టర్ మార్గదర్శకాల్ని జారీ చేశారు. ఎస్సీఈఆర్టీ ముద్రించిన ప్రశ్నపత్రాల్ని ఎంఈవో కార్యాలయాల్లో భద్రపర్చడంతో పాటు పరీక్షల్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని డీఈవో పి.శైలజ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల్ని ఆదేశించారు. ఆయా తేదీల్లో ప్రతి రోజూ మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.30 వరకు పరీక్షలు జరగనున్నాయి.

## యాదవులకు రాజకీయ గుర్తింపు ఇవ్వాలి

### రాజ్యసభ సభ్యులు బీద మస్తానరావు



తాడేపల్లిరూరల్ : యాదవులకు రాజకీయ పార్టీలు గుర్తింపు ఇవ్వాలని రాజ్యసభ సభ్యులు బీద మస్తానరావు కోరారు. ఆదివారం గుంటూరు జిల్లా కుంచనపల్లిలో యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఎంపీ పాల్గొని ప్రసంగించారు. 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో బీసీలకు 10 సీట్లు కూడా లేకపోవడం బాధాకరమని తెలిపారు. ప్రతి జిల్లాలో శ్రీకృష్ణ మందిరం ఏర్పాటు చేయాలని, రాజధానిలో 20 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఎంపీ కోరారు. లాకా వెంగళరావు మాట్లాడుతూ ప్రతి జిల్లాలో పశువుల కాపరుల పిల్లల విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. యాదవ్ కార్పొరేషన్‌కు రూ. 2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో యాదవ సామాజిక వర్గానికి మఠం, తిరుమలలో శరభయ్య, శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలు తిరుమల కూడళ్లలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ స్వామి, టీటీడీ పాలక మండలి సభ్యురాలు మెరుసు నాగ సత్య, అఖిల భారతీయ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్న రామచంద్ర, దానబోయిన సుందరరావు, రాష్ట్ర కార్యవర్గం, రాష్ట్ర నాయకులు, 20 జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# నేత్ర పర్వం.. దివ్య రథోత్సవం

- కన్నుల పండువగా శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దివ్య రథోత్సవం
- స్వాగతం పలికిన భక్తులు
- మహిళల కోలాటం, సన్నాయి, అఘోరాల నాట్యాలతో సందడి

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దివ్య రథోత్సవం అత్యంత వైభవంగా సాగింది. తొలుత ఆలయ అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీ భ్రమరాంబ అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తుల్ని అనుగ్రహించారు. ఉదయం 5 గంటల నుంచే సుప్రభాతసేవ, హారతులతో పూజలు ప్రారంభమయ్యాయి. అర్చకులు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహా నివేదన జరిపారు. సాయంత్రం 4 గంటలకు స్వామి దివ్య రథాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఆలయ బలిహరణ, రథాంగ ముద్రణలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన రథంపై శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని ఆశీనులు చేశారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకవర్గం సభ్యులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. హరియాణా అఘోరాల నృత్యాలు, మహిళల కోలాట, భజన ప్రదర్శనలతో విద్యుత్ కాంతుల నడుమ రథోత్సవం పెదకాకాని పురవీధుల్లో సాగింది. గ్రామ ప్రజలు దారి పొడవునా స్వాగతం పలికారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి సమర్పించి భక్తి శ్రద్ధల్ని చాటుకున్నారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. బాణసంచా వెలుతురులో శ్రీ భ్రమరాంబ అమ్మవారి దివ్య రథోత్సవం రాత్రి 11 గంటల వరకూ వైభవంగా జరిగింది. పెదకాకాని సీఐ కె. వీరాస్వామి పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఆలయ డెప్యూటీ కమిషనర్ వరప్రసాదరావు, చైర్మన్ శివశంకరరావు, భక్తులు

### నేడు తెప్పోత్సవం

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్ని పురస్కరించుకుని సోమవారం భ్రమరాంబ అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తుల్ని అనుగ్రహిస్తారు. సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం ఆలయం ప్రక్కనే ఉన్న మంచినీటి చెరువులో పూలతో అలంకరించిన హంస వాహనంపై అత్యంత వైభవంగా తెప్పోత్సవం కనులపండుగగా జరుగుతుందని డెప్యూటీ కమిషనర్ శ్రీరామ వరప్రసాదరావు తెలియజేశారు. ఇప్పటికే ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు.




పెదకాకానీలో రథోత్సవం సందర్భంగా పలు దేవతల వేషధారణలు, అఘోరాలు, కోలాట నృత్యాల సందడి



### పోలీసు సిబ్బందిని అభినందించిన ఐజీ పాలరాజు

మేదరమెట్ల: కొరిశపాడు మండలం పి.గుడిపాడు సమీపంలో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభను కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రశాంతంగా ముగిసిందని.. విధులు నిర్వహించిన ప్రతి ఒక్క పోలీసు అధికారులకు, సిబ్బందికి గుంటూరు ఐజీ పాలరాజు ఆదివారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన పోలీసు అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా సమర్థంగా విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ప్రశాంతంగా ముగిసిందని ఐజీ పేర్కొన్నారు.

## రైల్వే డివిజన్‌లో పలు ప్రాజెక్ట్‌లు జాతికి అంకితం

- తొమ్మిది స్టేషన్లలో రేపు ప్రధాన మంత్రి మోదీ చేతుల మీదుగా శిలాఫలకాలు ప్రారంభం
- హాజరుకానున్న ప్రజాప్రతినిధులు


వివరాలు వెల్లడిస్తున్న డీఆర్‌ఎం రామకృష్ణ

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని తొమ్మిది రైల్వే స్టేషన్లలో వివిధ ప్రాజెక్టులు పూర్తయిన సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈనెల 12న జాతికి అంకితం చేయనున్నట్లు డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ వెల్లడించారు. స్థానిక పట్టాభిపురంలోని డీఆర్‌ఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే డివిజన్ పరిధిలోని చెట్టినాడు సిమెంట్స్ పెద గార్లపాడు దాచేపల్లి, తుమ్మల చెరువు,సాయి బాలజీ వేర్ హౌసింగ్ లాజిస్టిక్స్ లిమిటెడ్ కొత్తగూడెం, మాడుగులపల్లె తిప్పర్తి, రేపల్లె ప్లాట్‌ఫారం–4, గుంటూరు పశ్చిమ విభాగం వైపు రైల్ కోచ్ రెస్టారెంట్, నల్గొండ ప్లాట్‌ఫారం–1, నంద్యాల ప్లాట్‌ఫారం–1, నరసరావుపేట ప్లాట్‌ఫారం–1, గిద్దలూరు ప్లాట్‌ఫారం–1, కంభం ప్లాట్‌ఫారం–1లలో వివిధ పనులు పూర్తయినట్లు చెప్పారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆయా స్టేషన్లలో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల మధ్య కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, రాజ్యసభ సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, ఆయా ప్రాంత వాసులు, రైల్వే ప్రయాణికులు, సంబంధిత అధికారులు పాల్గొంటారన్నారు. ప్రాజెక్టులు ప్రారంభం సందర్భంగా ముందుగా పలు సాంస్కృతిక కార్యక్రమాల్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీఎం కె.కమలాకర్ బాబు, డీఈఎన్ వెస్ట్ గౌతమ్ పాల్గొన్నారు.

## మహిళల్లో చైతన్యం రావాలి

యడ్లపాడు: మహిళలు ఆరోగ్యంగా ఉంటూ వారి హక్కుల్ని తెలుసుకున్నప్పుడే జీవితంలో ఉన్నతంగా రాణిస్తారని గుంటూరు జిల్లా వినియోగదారులు కమిషన్ జడ్జి తాడికొండ సునీత పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాపురం తిరుమల కాటన్ అండ్ జిన్నింగ్ మిల్లులో మహిళా దినోత్సవం సందర్భంగా అవగాహన, ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తిరుమల కాటన్స్, ఆగ్రో ప్రొడక్ట్స్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ, ముఖ్య అతిథి సునీత మహిళా దినోత్సవం విశిష్టత, మహిళా సాధికారత, వినియోగదారుల హక్కుల గురించి వివరించారు. సునీతను సంఘ సభ్యులు సత్కరించారు. వైద్యులు శ్రావణ్‌కుమార్, వాసుదేవ అంకమ్మ చౌదరి, ప్రఫుల్లాదేవి, కిరణ్‌కుమార్, ప్రశాంతి, సుష్మ, తేజస్వీ, రంజిత్‌కుమార్, మైథిలిరాణి, శిరీష, అనిత, ఇందిర పాల్గొని 250 మందికి పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, రూ.2 లక్షల విలువైన మందులు ఉచితంగా అందించారు.

# హరోం..హర అమరేశ్వర


ప్రత్యేక అలంకరణలో అమరేశ్వర స్వామి


అమరేశ్వరస్వామి రథోత్సవం


అమరేశ్వరస్వామి, బాల చాముండేశ్వరి ఉత్సవమూర్తులు

- భక్తజన సంద్రం అమరావతి
- వైభవంగా అమరేశ్వరుని రథోత్సవం

అమరావతి: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమరావతి క్షేత్రంలోని శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి దివ్య రథోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమరావతి, ధరణికోట గ్రామాల చింకా, ఆలపాటి, కోనూరు, కామిరెడ్డి వారి వంశస్తులు తమ గుర్రాలకు రంగులు వేసి ఊరేగింపుగా తెచ్చి స్వామివారికి సమర్పించారు. ఆలయ గాలిగోపురం నుంచి ప్రారంభమైన రథోత్సవం మేళతాళాలతో, భక్తుల శివ నామ స్మరణతో నందీశ్వరుడు ముందుండి నడిపిస్తుండగా అత్యంత వైభవోపేతంగా సాగింది. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన భక్తులతో అమరావతి భక్తజన సంద్రమైంది. 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.